ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 26.0

డీఎస్సీ పరీక్షకు 62మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా ఆదివారం స్థానిక సిద్ధార్థ క్వెస్ట్, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగిన పరీక్షకు ఉదయం షిఫ్టులో 215మంది అభ్యర్థులకు 178 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 302మందికి 277మంది హాజరయ్యారు. మొత్తం 62 మంది గైర్హాజరయ్యారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు

నూజివీడు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ అడ్మిషన్లకు సంబంధించి నేటి నుంచి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సోమ, మంగళవారాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తుండగా తొలిరోజు సోమవారం 505 మందికి, రెండవ రోజు 555 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఇందుకు సంబంధించి విద్యార్థుల సౌకర్యార్థం 25 కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు ఆర్జీయూకేటీ రిజిస్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. రిసెప్షన్ కౌంటర్‌తో పాటు డేటా ఎంట్రీ కౌంటర్లు 8, అకడమిక్ వెరిఫికేషన్ కౌంటర్లు 6, క్యాస్ట్ వెరిఫికేషన్ కౌంటర్లు 4, ఫీజ్ కౌంటర్లు 2, ఐడీ కార్డు జారీ చేయడానికి నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

జిల్లాలో వాహన తనిఖీలు



ఏలూరు క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసులు తమ పరిధిలోని వాహనాల తనిఖీలు చేశారు. ఏలూరు, నూజివీడు, పోలవరం, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, సీఐలు, సిబ్బంది రహదారులపై ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలన్నారు. పలువురు వాహనదారులకు రికార్డులు లేకపోవడంతో కౌన్సిలింగ్ నిర్వహించి ఈ-చలానాలను విధించారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. సోమవారం నుంచి కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా చింతలపూడి మండలంలో 9.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. జిల్లాలో సరాసరి వర్షపాతం 1.4 మి.మీ నమోదైంది. కొయ్యలగూడెంలో 8.4, కామవరపుకోట 7.4, ద్వారకా తిరుమల 5, బుట్టాయిగూడెం 4.2, జీలుగుమిల్లి 2, జంగారెడ్డిగూడెం 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో సార్వా వరి సాగు పనులు ఊపందుకున్నాయి.

నేటితో ముగియనున్న రేషన్ కార్డుల ఈకేవైసీ గడువు

ఏలూరుసిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):రేషన్ కార్డులకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ గడువు నేటితో ముగుస్తోంది. ఇప్పటికే జిల్లాలో 95.50 శాతం వరకు రేషన్ కార్డులలో సభ్యులకు ఈకేవైసీ పూర్తయిందని జిల్లా పౌరసరఫరాల శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం 6,20,164 రేషన్ కార్డులు ఉండగా ఇందులో 17.20 లక్షల మంది సభ్యులున్నారు. వీరందరికీ ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 16లక్షల 32వేలమంది సభ్యులకు ఈకేవైసీ పూర్తయింది. ఇంకా 4.50 శాతం మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఎప్పటినుంచో కార్డుదారుల్లో సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నా ఇంకా కొంతమంది సభ్యులకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పలు కారణాల వల్ల కొంతమంది ఈకేవైసీ చేయించుకోలేక పోయారు. గడువు పెంచే అవకాశాలున్నాయా.. లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఈకేవైసీ చేయించుకుంటేనే ఇకపై ప్రతి నెలా చౌకడిపోల ద్వారా సరుకులు ఇస్తారనే ప్రచారం సాగుతోంది.

పార్టీని బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల..పక్కన డీసీసీ అధ్యక్షుడు హరికుమార్ రాజు, మాజీ మంత్రి బాపిరాజు

సమన్వయంతో ముందుకు వెళ్లాలి
మండల, గ్రామస్థాయిల్లో కమిటీలు వేయండి
కాంగ్రెస్ పార్టీ 'పశ్చిమ' సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

భీమవరం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ నాయకత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా భీమవరంలోని ఆనందా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ బలోపేతం ఎలా చెయ్యాలి ? నాయకత్వంపైనా సమాచారాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షుడు అందరికి కలుపుకుని ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని పట్టణ, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. ప్రజా సమస్యలపై పోరాటం చెయ్యాలి. ప్రజల పక్షాన పోరాడాలి అని అన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ అవసరం ఎంతో ఉందన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చెయ్యలేకపోయిందని విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తే ఒక్కరూ ప్రశ్నించడం లేదన్నారు. విభజన హామీలను అమలు చేసే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరికుమార్‌రాజు, కేబీఆర్ నాయుడు, ఏడు నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సిఫార్సుకే ప్రాధాన్యం

- పారదర్శకత లోపించిందని ఉద్యోగుల ఆవేదన
- కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

ఏలూరుసిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఆదివారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా సిఫార్సు ఉంటేనే బదిలీ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. బదిలీ ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని, ఎమ్మెల్యేల సిఫార్సు పత్రాలు ఉంటేనే బదిలీలు చేస్తున్నారని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే విమర్శించడం గమనార్హం.

జిల్లాలో సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండో రోజు ఏలూరులోని పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా ఆప్షన్ ఫారాలపై మూడు ఆప్షన్లు కోరుకోమని చెబుతున్నారని, అసలు ఖాళీలు జాబితా ప్రకటించకుండా ఏ విధంగా కోరుకోవాలని పలువురు సచివాలయ ఉద్యోగులు ప్రశ్నించారు. సిఫార్సు పత్రాలు ఉన్నవారినే పరిగణలోకి తీసుకుంటున్నారని పేర్కొంటున్నారు. అసలు ఏ సిఫార్సు పత్రాలు లేకుంటే బదిలీలు చేయరా..? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు స్పౌజ్ కోటా ఉన్నా సిఫార్సు లేఖ ఉంటేనే ఉద్యోగులు ఎంపిక చేసుకున్న ప్రాంతానికి బదిలీ చేస్తామని సంబంధిత అధికారులే చెబుతుండడంతో ఉద్యోగులు ఏమి చేయాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. సచివాయాల హేతుబద్ధీకరణ నేపథ్యంలో కొన్ని చోట్ల ఇంజనీరింగ్ పోస్టులకు అవకాశం లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. కాగా సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఒక ప్రహసనంలా మారిందని, రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. ఆదివారం ఇంకా పలు శాఖలకు చెందిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ జరిగింది.

ఆందోళన చేస్తున్న ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు



సార్.. అన్యాయం చేయొద్దు..

కౌన్సెలింగ్‌లో నిబంధనలు పాటించడం లేదు.. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల నిరసన

ఏలూరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బదిలీల్లో సోషల్ వెల్ఫేర్ జేడీ నిబంధనలు పాటించడం లేదని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. స్థానిక బాలయోగి సైన్స్ పార్క్ వద్ద సంఘం ఆధ్వర్యంలో పలువురు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ జేడీ వై.విశ్వమోహన్‌రెడ్డి కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సు చేసిన వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. పారదర్శకంగా నిబంధనలు పాటించి బదిలీలు చేస్తున్నామని జేడీ వ్యాఖ్యలపై మండిపడుతూ కార్యాలయ ఆవరణలోనే ఆందోళనకు దిగారు. గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌బాబు, ఏపీ జేఏసీ కార్యదర్శి మాట్లాడుతూ ఖాళీ పోస్టుల వివరాలు బహిర్గత పరచకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని, అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫారసు లేఖలు ఉంటేనే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. తమకు న్యాయం జరగకపోతే కౌన్సెలింగ్ బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత బదిలీల ప్రక్రియలో సుమారు 700 మంది తప్పనిసరిగా బదిలీ అయ్యే పరిస్థితి ఉండగా ఆ మేరకు ఖాళీల వివరాలు తెలపకుండా కౌన్సెలింగ్ కేంద్రాల అధికారులు మూడు ప్రాంతాల్లో ఆప్షన్లు ఇవ్వాలని సూచిస్తున్నారని, ఉద్యోగులు ఇచ్చిన మూడు ఆప్షన్లు ఖాళీ లేకపోతే ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. కాగా బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని సోషల్ వెల్ఫేర్ జేడీ వై.విశ్వమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. బదిలీల్లో దివ్యాంగులు, వితంతువులకు ప్రాధాన్యనిస్తున్నామని, ప్రజా ప్రతినిధుల లేఖలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

పెండింగ్‌లో పారిశ్రామిక ప్రోత్సాహకాలు

- జిల్లాలో 380 మందికి రూ.36.89 కోట్ల బకాయిలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమలు, వివిధ యూనిట్లను స్థాపించిన లబ్ధిదారులు ప్రభుత్వ ప్రోత్సాహకాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సంవత్సరానికి ముందు వైసీపీ హయాంలో మంజూరైన 2022-23 ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ(ఐడీపీ) కింద పరిశ్రమలు స్థాపించిన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ప్రోత్సాహకాలు విడుదల చేయకపోవడంతో తమ సమస్య ఎవరి చెప్పుకోలేక అటు బ్యాంకులు, ఇటు పరిశ్రమల కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. రెండేళ్లు అవుతున్నా వారికి సంబంధించిన రాయితీల సొమ్ములు జమ కాలేదు. జిల్లాలో సిరామిక్, ఫుడ్ ప్రాసెసింగ్, బల్‌మిల్క్ చిల్లింగ్ యూనిట్లు, ఇతర యూనిట్లు స్థాపించిన వారితో పాటు స్వయం ఉపాధి కోసం వివిధ కార్లు, ఆటోలకు రుణాల పొందిన వారిది ఇదే పరిస్థితి. రూ.5లక్షల నుంచి రూ.20 లక్షల పైబడి పెట్టుబడి వ్యయంతో యూనిట్లు స్థాపించిన వారికి మార్జిన్ మనీ,విద్యుత్, ఇతర అంశాల పరంగా రాయితీల కింద ఈ మొత్తాలు జమ కావాల్సి ఉంది.

ఎస్సీ లబ్ధిదారులే ఎక్కువ..

ప్రధానంగా ఎస్సీ కేటగిరి కింద సింహభాగం 241 మంది రూ.22కోట్ల 12 లక్షలు మేర రాయితీల సొమ్ము జమ కావాల్సింది. జనరల్ కేటగిరి కింద 92 మందికి రూ.8కోట్ల 74లక్షలు, బీసీ వర్గాలు 11 యూనిట్లకు రూ.కోటి 56 లక్షలు, ఎస్టీలకు 36 మందికి రూ.4కోట్ల47లక్షలు రాయితీ అందాల్సి ఉంది. అయితే ఈ యూనిట్ల స్థాపన విషయంలో ఏవైనా అవకతవకలు జరిగాయా? లేదా యూనిట్లు నడుస్తున్నాయా? లేదా అన్న అంశాలపై క్షేత్రస్థాయిలో ఇటీవల ఆరా తీసి ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. దీనివల్ల నిధులు విడుదల జాప్యమైనట్టు చెబుతున్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావును దీనిపై వివరణ కోరగా రూ.36 కోట్ల 89 లక్షల బకాయిలు విడుదల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు.

ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి

- ఎనిమిది కాసుల బంగారు ఆభరణాల చోరీ

సరిహద్దుల్లో పేకాట జోరు !

- ఆంధ్ర, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా జూదం

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మరో మూడు నెలల పొడిగింపు

లోపలి పేజీలో..

మూడు నెలల పాటు.. జన సంరక్ష పథకాలకు అర్హుల నమోదు

- లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి

ఏలూరుసిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జన సంరక్ష పథకాల ద్వారా సామాన్యప్రజలకు భద్రత కల్పించడం జరుగుతుందని లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి ఆదివారం తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి సహకారంతో జిల్లా వ్యాప్తంగా జూలై 1వ తేదీ నుంచి మూడు నెలల పాటు అర్హులందరికీ జన సంరక్ష పథకాలకు సంబంధించి నమోదు కార్యక్రమ ప్రచా రం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అటల్ పెన్షన్ యోజన, పీఎం సురక్షా యోజన,పీఎంజేడీవై, తది తర పొదుపు, బీమా పథకాలపై ప్రచారం చేస్తారని, అర్హులైన వారు ఈ పథకాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.



ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

[illegible]

ఏలూరు [illegible] జూన్ 29 (ఆంధ్రజ్యోతి) [illegible] ఇప్పటి వరకు సుమారు [illegible] 20 శాతం పన్నులు వసూలు [illegible] వారు [illegible] మంది, [illegible] 13 [illegible] ఉన్నారు. [illegible] 538మంది [illegible] పన్ను వసూళ్లు [illegible] రూ.16.67 [illegible] చేయాలని [illegible] చేయాలని సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారు.



లక్ష్యాన్ని పూర్తి చేస్తాం ..

[illegible] రూ.70.88 కోట్ల [illegible] పన్ను వసూలు చేయాలని [illegible] రూ.70.88 [illegible] పూర్తి [illegible] 20 శాతం [illegible]

[illegible], కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

ఎంఈవోల వ్యవస్థలో 'ఇద్దరి' అవస్థలు !

- సమస్య పరిష్కారానికి వేర్వేరు ప్రతిపాదనలతో తలోవాదన
- గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన చిచ్చు
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే మేలు

లోపలి పేజీలో..

తట్టా బుట్టా..సర్దుకుని!

- వరద భయంతో పునరావాస కాలనీలకు తరలిపోతున్న ప్రజలు
- పరిహారం అందని నిర్వాసితులు సమీప గ్రామాల్లో అద్దె ఇళ్లకు మొగ్గు



పునరావాస కాలనీకి ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఇళ్లలోని సామగ్రి

వేలేరుపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గతంలో వరదల సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాల నేపథ్యంలో ముంపు మండలాల్లోని ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. జూలై వస్తుందంటేనే ముంపు మండలాల ప్రజల గుండెల్లో గుబులు ప్రారంభమవుతుంది. గోదావరికి వరదలు వచ్చే సమయం అసన్నమవుతుంది. ఏటా గోదావరి వరదల కారణంగా ఈ ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల సమయంలోనే గ్రామాల్లోని ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు అప్పటికప్పుడు తరలిపోవాలంటే అవస్థలు పడుతున్నారు. ఇళ్లలోని సామాన్లు పూర్తిగా తరలించే సమయం ఉండకపోవడం వల్ల వరదలకు మునిగిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

మూడేళ్లుగా ఎంతో నష్టం

ఈ ప్రాంత ప్రజలు గత మూడేళ్లుగా వరదల కారణంగా ఎంతో నష్టపోయారు. 2022 జూలైలో వచ్చిన భారీ వరదల కారణంగా గ్రామా లకు గ్రామాలే నీటమునగా తీవ్ర ఆస్తి, పశు నష్టం సంభవించింది. అయా గ్రామస్థులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వచ్చింది. గతేడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలల పాటు గోదావరి వరదలు, పెదవాగు బీభత్సం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలా గత చేదు అనుభవాల నేపథ్యంలో ప్రజలు ఈ ఏడాది ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇళ్ల ప్యాకేజీల సొమ్ములు జమ అయినవారు తమకు కేటాయించిన పునరావాస కాలనీలకు తరలిపోతుండగా ప్యాకేజీ అందని వారు సొంత భూములు ఉండి వ్యవసాయం చేసుకునేవారు మండలంలోని శివకాశీపురం, భూదేవిపేట, బండలబోరు, తదితర గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని ఈ మూడు నెలల పాటు ఆశ్రయం పొందేందుకు వీలుగా తమ ఇళ్లలోని సామగ్రిని తరలిస్తున్నారు.

గుట్టల మీద గుడిసెలు

గోదావరి వరదకారణంగా దారులు మూసుకుపోయే ప్రమాదం ఉన్న రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్లవరం, చిగురుమామిడి గ్రామాల ప్రజలు కొన్ని రోజులుగా తమవస్తు సామగ్రితో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతుండగా రుద్రమ్మకోట, మట్టిగట్ల, చిగురుమామిడి, కోయిదా గ్రామాల ప్రజలు సమీపంలోని గుట్టల మీద గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రానున్న మూడునెలలపాటు వీరికి కొండగుట్టలే ఆవాసం. రేపాకగొమ్ము గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు ఆదివారం పునరావాస కాలనీలకు ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తమ ఇళ్లలోని సామగ్రిని తరలించారు.

తరలి వెళ్లాలంటూ ఒత్తిడి

ముంపు ప్రమా దం ఉన్న గ్రామాల ప్రజలు గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కాలనీలకు తరలివెళ్లాలంటూ నెల రోజుల నుంచి రెవెన్యూ, పోలీస్‌శాఖాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ముందుగానే తరలివెళ్తే పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తామని అప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలంటే ఇబ్బంది అవుతుందని వారు పేర్కొంటున్నారు. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇళ్లపరిహారం జమ అయిన నిర్వాసి తులు తరలిపోయేందుకు సిద్ధంగా ఉన్నప్పటికి ఇంకా పరిహారాలు జమకానీ నిర్వాసితులు పునరావాస కానీలకు తరలివెళ్లేందుకు సుముకత వ్యక్తం చేయడంలేదు. ఈ ఏడాది జనవరిలో కొంతమంది (మిగతా 8వ పేజీలో)



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయలు

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

పెంటపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల ధరలు స్వల్పంగా పెరగాయి. గతవారం కంటే ఈ వారం కూరగాయల ధర రూ.10 నుంచి 20 వరకు పెరిగాయి. కొన్ని కూరగాలయల ధరలు మాత్రమే నిలకడగా కొనసాగాయి. బెండకాయలు గతవారం కేజీ రూ.40 ఉంటే ఈవారం రూ.50లకు చేరాయి. ఇవే బెండకాయలు గ్రామాల్లో రూ.60 వరకు అమ్మకాలు జరిగాయి. గత వారం మాదిరిగా ఉల్లి పాయలు రకాన్ని బట్టి 4 కేజీలు రూ.100, 5 కేజీలు రూ. 100 విక్రయాలు సాగాయి. ఉల్లిపాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం మార్కెట్‌లో ధరలు ఇలా.. కేజీ టమాటా రూ.30, బీరకాయలు కేజీ రూ.50, దొండకాయలు రూ.40, బెండకాయలు రూ.50, తెల్లవంకాయిలు కేజీ రూ.60చ నల్ల వంకాయిలు కేజీ రూ.50, అల్లం కేజీ రూ.60, మునగకాయలు 3 రూ.20, అనపకాయ రూ.15, దోసకాయలు రూ.20, అరటికాయలు 3 రూ.20, క్యాబేజి రూ.30 , బీట్‌రూట్ కేజీ రూ.50, బిన్నీస్ కేజీ రూ.80, కాప్సికం రూ.70, పచ్చి మిరపకాయలు కేజీ రూ.40 విక్రయాలు సాగాయి.



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వున్న భక్తులు

శ్రీవారి సన్నిధిలో భక్తుల కిటకిట

ద్వారకాతిరుమల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. దాదాపు 15వేలకు పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి మూడు గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం నుంచి రద్దీ కాస్తతగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో జగన్నాథుడు భక్తులకు ఆదివారం దర్శన భాగ్యాన్ని కల్పించారు. శ్రీజగన్నా థుని రథోత్సవాల్లో భాగంగా పురాతన లక్ష్మీపురం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జగన్నాథుడు రోజుకో అలంకరణలో సాక్షాత్కరిస్తున్నారు, సుభద్ర, బలభద్ర సమేతంగా కొలువై శంఖు చక్రాలను ధరించి అభయహస్తాన్ని ప్రసాదిస్తూ.. వరాహావతారంగా స్వామివారు భక్తులను అనుగ్రహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, జూన్ (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ అటవీ ప్రాంతంలో కొలువైన వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు మొక్కులు తీర్చుకోవాలని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఏజెన్సీకి తరలి వస్తున్నారు. ఆలయానికి వెళ్లే రోడ్లు కిటకిటలాడాయి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.

వారాహిదేవికి సరస్వతి అలంకరణ



పెనుమంట్ర, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మల్లిపూడి గ్రామంలో వారాహిదేవి ఆలయంలో అమ్మవారి నవరాత్రులు పురస్కరించుకుని నాలుగోరోజు ఆదివారం సర్వసతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు వారణాశి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. సరస్వతిదేవి అలంకరణలో ఉన్న వారాహిదేవికి విద్యార్థులు పూజలు నిర్వహించారు 5వ తేదీ వరకు నవరాత్రి పూజలు జరుగుతాయని గుడిమెట్ల సాయిబాబారెడ్డి తెలిపారు.

గంజాయి



తాడేపల్లిగూడెంకు చెందిన ఓ వైద్యుడు ఏడాది క్రితం డ్రగ్స్‌కు బానిసై మునిగితేలాడు. ఒక సమయంలో డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో సమీపంలోని మందుల షాపునకు వెళ్లి మత్తు ఇచ్చే దగ్గు అరుకుని ఇవ్వమని కోరాడు. దానికి యజమాని నిరాకరించడంతో అతడిపై దాడి చేశాడు. అతడి చేయి కూడా విరిగింది.

భీమవరం పట్టణానికి చెందిన నలుగురు యువకులు కొన్నాళ్ల క్రితం గంజాయి మత్తులో ఉండి కొందరిపై దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే గంజాయి మత్తులో ఉన్నట్టుగా తేలింది.

ఆకివీడుకు చెందిన కొందరు యువకులు గంజాయి మత్తుకు అలవాటు పడి నిత్యం ఒక ప్రదేశంలో గంజాయి సేవించేవారు. దానిని అక్కడున్న స్థానికులు ఖండించడంతో వారిపై దాడికి దిగారు.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పెరుగుతున్న వినియోగం

» అవగాహన కల్పిస్తున్నా తగ్గని సరఫరా » ఈగిల్ టీమ్ ఉన్నా అంతంతమాత్రమే..

గంజాయి వ్యాపారం అంతటా విస్తరించింది. ముఖ్యంగా రైల్వే లైన్, జాతీయ రహదారులే లక్ష్యంగా ముఠాలు రెచ్చిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చిన్నపాటి కళాశాలల నుంచి ఇంజనీరింగ్ కళాశాలల వరకు గంజాయి విస్తరించిందనడంలో సందేహం లేదు. గతంలో గంజాయి మూలాలు ఉన్నప్పటికి గత ప్రభుత్వంలో క్రయ విక్రయాలు రెట్టింపయ్యాయి. గంజాయి ఎంత విస్తరించిందంటే ఓ ఆటో డ్రైవర్ ఇంటి ముందు గంజాయి మొక్కలు పెంచేంతలా పాకింది. వాటి నిర్మూలనకు పోలీస్‌శాఖ ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారని ప్రత్యేకంగా మూడు నెలల క్రితం ఈగిల్ టీంను ప్రారంభించారు. ఈ టీం రానున్న రోజుల్లో గంజాయి మత్తును ఏవిధంగా వదిలిస్తారో చూడాల్సి ఉంది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

భీమవరం క్రైం/తాడేపల్లిగూడెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు, ప్రముఖ విద్యా సంస్థల వద్ద కాపు కాసిన కొన్ని ముఠాలు విద్యార్థులను గంజాయి ఉచ్చులోకి లాగుతూ వారి జీవితాలను నాశనం చేస్తున్నాయి. ఎక్కువగా సిగరెట్లు కాల్చే విద్యార్థులకు గంజాయిని ఎలా వినియోగించాలో చూపించి వారిని ఆ మత్తులోకి వెళ్లేలా వల వేస్తున్నారు. రెండు, మూడుసార్లు అలవాటు చేసుకున్న విద్యార్థులు దాని కోసం ఎన్ని రూపాయలైనా ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు. ఈవిధంగా చదువును పక్కన పెడుతున్నారు. తద్వారా చాలామంది యువత చదువుతో వెనకబడి అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల కాలంలో వస్తున్న క్రికెట్ మ్యాచ్‌లు వంటి వాటికి పందేలు కాసి ఆ పందేల్లో వచ్చే సొమ్మును గంజాయి, డ్రగ్స్‌కు వినియోగిస్తూ ఊబిలోకి కూరుకుపోతున్నారు. దీనిపై ఎన్నో రకాలుగా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలామందిలో మార్పు కనబడటం లేదు. ఈ కోవలోనే భీమవరం పట్టణానికి చెందిన ఒక యువకుడు నైజీరియా నుంచి భీమవరానికి ఆన్‌లైన్‌లో డ్రగ్స్ బుక్ చేయడంతో చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అవి కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డాయి. దీంతో రెస్ట్‌హౌస్ రోడ్డుకు చెందిన యువకుడిని అక్కడి పోలీసులు వచ్చి అరెస్ట్ చేశారు. దీనిలో భాగంగా విచారణలో ఆ యువకుడు డ్రగ్స్‌ను తీసుకువచ్చి ఇక్కడ ఉన్న విద్యార్థులకు, యువతకు విక్రయిస్తున్నట్లుగా తేలింది. అప్పట్లో ఈ విషయం సంచలనమైంది.

నైజీరియన్‌కు చెందిన ఒక వ్యక్తి ఈ ప్రాంతానికి వచ్చి డ్రగ్స్ వినియోగిస్తుండగా ఎక్సైజ్ శాఖ అధికారులు అతడిని అరెస్ట్ చేసి నైజీరియా పోలీసులకు అప్పగించారు. నాలుగేళ్ళ క్రితం భారీ స్థాయిలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తరలిస్తుండగా స్థానిక పోలీసులు భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో దానిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంచుమించుగా ఆ గంజాయి టన్ను వరకు ఉండవచ్చని అప్పట్లో పోలీసులు తెలిపారు. నలుగురు యువకులను కూడా అరెస్ట్ చేశారు. ఇటీవల ఉండి శివారు ఉప్పుగుంట ప్రాంతంలో కొంతమంది యువకులు గంజాయి తీసుకువచ్చి విక్రయాలు చేస్తుండగా ఉండి పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. దీనిలో ఒక హెడ్ కానిస్టేబుల్ వారి వద్ద డబ్బులు తీసుకున్నట్లుగా ఆరోపణలు రావడంతో అతడిని బదిలీ చేశారు.

ఈగిల్ టీమ్‌కు చిక్కింది ఇదే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈగిల్ టీం పర్యవేక్షణ చేస్తోంది. ఈ బృందం ద్వారా ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో ఐదు కేసుల్లో 416 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోగా వాటి విలువ రూ.16 లక్షలు ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు కేసుల్లో రెండు కేజీల గంజాయి పట్టుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 12 కేసుల్లో రూ.78 లక్షల విలువ చేసే రెండు వేల కేజీల గంజాయి సీజ్ చేశారు. గంజాయి కేసులు ఏజెన్సీ ప్రాంతాలతో పాటు రైల్వే, జాతీయ రహదారిలకు ఆనుకుని గంజాయి సరఫరా గుట్టుగా సాగుతుందని పోలీస్‌శాఖ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గంజాయిని అరికడుతున్నాం



గంజాయిని అరికట్టేందుకు ఎన్నో రకాలుగా కృషి చేస్తున్నాం. ప్రత్యేకించి అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాకో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశాం. గంజాయి విక్రయాలు జరిగినా, వినియోగించినా చర్యలు తీసుకుంటుంది. కాలేజీలు, పాఠశాలల్లోను గంజాయి వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాం.

- ఆర్ఎస్ కుమరేశ్వరన్, ఎక్సైజ్ శాఖ అధికారి, పశ్చిమ జిల్లా

మత్తు పదార్థాలతో క్యాన్సర్



ఇటీవల కాలంలో చాలా మంది యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. అల్కాహాల్‌తో పాటుగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుకు అలవాటు పడి అనారోగ్యాల పాలవుతున్నారు. మత్తు పదార్థాలు ఎక్కువగా సేవించడం వల్ల పేగు క్యాన్సర్, లివర్ క్యాన్సర్, కిడ్నీలు పని చేయకపోవడం తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

- డాక్టర్ మాధవీ కల్యాణి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

ఎంఈవోల వ్యవస్థలో 'ఇద్దరి' అవస్థలు !

» సమస్య పరిష్కారానికి వేర్వేరు ప్రతిపాదనలతో తలో వాదన » గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన చిచ్చు » ప్రభుత్వం దృష్టిసారిస్తేనే మేలు

ఏలూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలాల్లో ప్రభుత్వ విద్యాపథకాలు, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్ల పనితీరు పరిశీలన, విద్యార్థుల విద్యాసామర్థ్యాల మదింపు తదితర కీలక కార్యకలాపాలకు ఉద్దేశించిన మండల విద్యాధికారుల(ఎంఈవో-1,2)వ్యవస్థలో నెలకొన్న సంస్థాగత సమస్యలపై రెండు రకాల ఎంఈవోల సంఘాలు ఆదివారం వేర్వేరుగా గళంవిప్పాయి. ఒకే పనికి ఇద్దరు సమానహోదాగల అధికారుల వల్ల క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టాయి. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థవల్ల ఏర్పడిన అసమానతలను తొలగించి వెంటనే బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని ఎంఈవో-2ల సంఘం నాయకులు పట్టుబట్టగా, మండలానికి ఇద్దరు వద్దు..ఒక్కరే చాలునని పేర్కొంటూ ఎంఈవోలిద్దరినీ ఏకీకృతంచేసే ఫార్మూలాను అమలు చేయడమే సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారమని ఎంఈవో-1ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ సమస్యలపై వేర్వేరు ప్రకటనల సారాంశమిదే.

అసమానతలు తొలగించి, బదిలీలు చేపట్టాలి : ఎంఈవో-2ల సంఘం

గత తొమ్మిదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఎంఈవోలకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలని ఏపీ ఎంఈవో-2 సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.వి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ యాజమాన్యాలకు చెందిన హెచ్ఎంలతో మండలానికి ఇద్దరు చొప్పున నియామకాలు జరిగిన ఎంఈవోల వ్యవస్థలో భాగంగా మండల విద్యాధికారులను ఉమ్మడి సీనియార్టీ ద్వారా బదిలీ చేస్తారన్న ప్రచారంలో వాస్తవంలేదని ప్రభుత్వమే స్పష్టం చేయాలని కోరారు. ఇప్పటికే డీడీవోలుగా పనిచేసిన గ్రేడ్-2 హెచ్ఎంలను కన్వర్షన్‌ద్వారా ఎంఈవోలను నియమించగా, గత వైసీపీ ప్రభుత్వ వివక్షత కారణంగా ఎంఈవో-1ను డీడీవోగాను, ఎంఈవో-2ను నాన్ డీడీవోలుగా విభజించి సమాన హోదాకు దూరం చేసిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ మధ్య అసమానతలు సృష్టించిందని, దీనివల్ల ప్రజల్లో ఎంఈవో-2 అంటే చులకనభావం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏకీకృతంతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎంఈవో-1ల సంఘం

మండల స్థాయిలో వున్న తహసీల్దార్, ఎంపీడీవో, తదితర వ్యవస్థలు ఏ ఒక్క దానిలోనూ ఇద్దరు అధికారులు చొప్పున పర్యవేక్షణ లేదని, దానికననుగుణంగానే ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను కూడా ఏకీకృతం చేసి మండలానికి ఒక్క ఎంఈవో మాత్రమే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1ల సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పలు అంశాలను వివరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 679మంది చొప్పున ఎంఈవో-1, 2లు ఉన్నారని, ఈ రెండు పోస్టులను ఏకీకృతం చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆ ప్రకారం మొత్తం 679మంది ఎంఈవో-1 పోస్టుల్లో ప్రస్తుతం 400మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన ఖాళీల్లో ఎంఈవో-2లను భర్తీచేస్తే ఇంకా మిగిలిన వారు గ్రేడ్-2 హెచ్ఎంలుగా వెళ్లిపోవడానికి సుముఖంగావున్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎంఈవోలను ఏకీకృతం చేయడం ఒక్కటే ఫార్మూలా అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏకీకృత ఎంఈవో వ్యవస్థను పునఃప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

క్రైం సమాచారం

ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి..


» ఎనిమిది కాసుల బంగారు ఆభరణాల చోరీ



వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రవికుమార్

కైకలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఆగంతుకుడు దాడి చేసి ఆభరణాలు దోచుకున్న ఘటన సంచలనం రేపింది. కైకలూరు మండలం రామవరంలో శనివారం రాత్రి గ్రామానికి చెందిన గుడూరు నాగలక్ష్మి(62) భోజనం చేసి ఇంటి ఆరుబయల నిలబడింది. ఆగంతుకుడు వెనుక వైపు నుంచి వచ్చి తలకు ముసుగు వేసి దాడి చేశాడు. కేకలు వేయకుండా అడ్డుకుని ఆమె చేతికి ఉన్న రెండు బంగారు గాజులు, మెడలోని చైన్ మొత్తం 8 కాసుల ఆభరణాలను దొంగలించి పారిపోయాడు. కొద్దిసేపటికి ఆమె కోలుకుని ఇరుగు పొరుగు వారిని పిలిచి విషయం చెప్పగా కైకలూరు రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. నాగలక్ష్మికి ఒక కుమార్తె ఉండగా ఆమె చెన్నైలో ఉంటోంది. ఆమె ఒంటరిగా నివాసం ఉంటుందని గుర్తించి చోరీకి పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, రూరల్ ఎస్ఐ వి.రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



చెక్కపల్లిలో బోల్తాకొట్టిన వాహనం

ముసునూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని చెక్కపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన టాటాఏస్ వాహనం రమణక్కపేట వైపు వెళుతున్న క్రమంలో నూజివీడు మండలం నెహ్రూనగర్‌కు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు చెక్కపల్లి వైపు వస్తుండగా అతివేగంతో టాటాఏస్ వాహనం ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ఉన్న నలుగురు వ్యక్తులతోపాటు టాటా ఏస్ వాహనంలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో టాటా ఏస్ వాహనం పక్కకు పడిపోగా, రెండు బైక్‌లు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

సరిహద్దుల్లో పేకాట జోరు !

ఆంధ్ర, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా జూదం

కుక్కునూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో మళ్లీ పేకాట జోరుగా సాగుతుందనే ప్రచారం జరుగుతోంది. కుక్కునూరు మండలంలో వేలేరు శివారు గ్రామపంచాయతీలోని అటవీ ప్రాంతంలో రోజుకోకచోట పేకాట స్థావరం ఏర్పాటు చేసుకుని యదేచ్ఛగా పేకాట ఆడటం ఎప్పటి నుంచో ఉంది. పత్రికల్లో వార్తలు వచ్చినా, పోలీసులు నిఘా పెట్టిన సమయంలోనూ కొన్ని రోజుల పాటు పేకాటకు విరామం పలికి మళ్లీ కొనసాగించటం ఇక్కడ మామూలుగా జరుగుతూనే ఉంది. తెలంగాణకు చెందిన కొందరూ వ్యక్తులు ఈ ప్రాంతంలో పేకాటను నిర్వహిస్తుండగా అందుకు కొందరూ స్థానికులు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల మరలా పేకటా మొదలయ్యిందనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా తెలంగాణలోని పలు ప్రాంతాలకు చెందిన జూదర్లు ఇక్కడ జరిగే పేకాటకు తరలివస్తు న్నారనే సమాచారం కుక్కునూరు మండల కేంద్రానికి దాదాపుగా 40 కిలో మీటర్ల దూరంలో ఈ పేకాట జరుగుతుండడంతో వారికి అవకాశంగా మారింది. పోలీసులకు పేకాట జరుగుతు న్నట్లు సమాచా రం అందించి అక్కడకు వెళ్లేలోపే జూదర్లు ఏర్పాటు చేసుకున్న నిఘాతో వెంటనే వారికి సమాచారం వెళ్లిపోతుంది. గతంలో ఇక్కడ భారీస్థాయిలో జరుగుతున్న పేకాట స్థావరం పై ఏలూరు నుంచి ప్రత్యేక స్క్వాడ్ బృందం వచ్చి దాడి జరిపారు. ఈ దాడిలో వేలాది రూపాయలు నగదు, వాహనాలు, పలువురు ప్రముఖులు పట్టుబడ్డారు. అయినప్పటికి ఈ శివారు ప్రాంతంలో పేకాట జరగడం నిత్యకృత్యమైంది. పోలీస్‌శాఖ నిఘా పెంచి దాడులు చేస్తేనే పేకాట నిర్వహణ నిలుస్తాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న జూదంలో వేలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు సమాచారం.

మొగల్తూరులో చోరీ

» మూడు కాసుల బంగారం, వెండి వస్తువులు అపహరణ

మొగల్తూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు కోట వద్ద ఒక ఇంటిలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరిం చిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. విద్యుత్ శాఖలో మొగల్తూరు ఎల్ఐగా పనిచేసి మృతి చెందిన ఏడీఎంఆర్ లూథరన్ బాబు మొగల్తూరు కోట వద్ద సొంతిల్లు నిర్మించుకున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంటి వెనుక భాగం నుంచి ప్రవేశించి సుమారు మూడు కాసుల బంగారు అభరణాలు, కిలో వెండి వస్తువులతో పాటు రూ.30వేలు నగదు దొంగలు అపహ రించినట్టు లూథరన్ బాబు సతీమణి అద్దంకి శేషారత్నం తెలిపారు. తన కుమారుడు ఆకివీడు పట్టణంలో విద్యుత్ శాఖ ఏఈగా పని చేస్తుండడంతో వారానికి రెండురోజులు మాత్రమే కోట వద్ద నివాసంలో ఉంటున్నామన్నారు. ఆదివారం ఆమె ఫిర్యాదు మేరకు నరసాపురం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ నాగలక్ష్మి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించి తనిఖీలు చేశారు. ఈ ఘటనపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాయిగా ఆహ్లాదంగా..



పిప్పర, తాడేపల్లిగూడెం రహదారి మధ్యలో పచ్చని చెట్లు

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మొక్కలు నాటండి, వాటిని సంరక్షించండి అంటూ ప్రచారాలు చేస్తున్నాయి. ఇదే కోవలో గణపవరం మండలం పిప్పర, తాడేపల్లిగూడెం రహదారి నడుమ చిలకంపాడు గ్రామాల మధ్య ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం మొక్కలు నాటించింది. చిలకంపాడు గ్రామానికి చెందిన కొంతమంది బాధ్యత తీసుకుని మొక్కలను రక్షించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర అవి నేడు పెద్దవై రోడ్డు పక్కన ప్రయాణికులకు నీడనిస్తూ ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు కార్లలో ప్రయాణించే వారు వాహనాలు ఆపి చెట్ల కింద భోజనాలు చేసి వెళ్తున్న ఘటనలు దర్శనమిస్తున్నాయి.

- గణపవరం

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మరో మూడు నెలల పొడిగింపు

నరసాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి):నరసాపురం బెంగళూరు మధ్య శుక్ర, శనివారాల్లో నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉత్వర్తులు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు ఈ నెలాఖరుకు ముగియనుంది. ప్రయాణికుల డిమాండ్ పరిగణనలోకి తీసుకుని మరో మూడు నెలలు పొడిగించారు. 07153 నంబర్‌తో నడిచే ఈ రైలు నరసాపురంలో ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరిగి అక్కడ 074154 నంబర్‌తో 10.50కి బయలుదేరి ఆదివారం ఉదయం 5 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.



ఖైదీలకు అందించే ఆహారాన్ని పరీక్షిస్తున్న శ్రీదేవి

'ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలి'

చింతలపూడి, జూన్ 29(ఆంధ్రజ్యోతి):జైలు ప్రాంగణంలో వున్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ఖైదీలు వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సూచించారు. ఆదివారం చింతలపూడిలోని సబ్‌జైల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో వచ్చేనెల 5న నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని పోలీసులకు సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు, న్యాయవాదులు టి.వెంకటేష్, పీఎల్‌రాజు, జైలు సూపరింటెండెంట్ కృపానందం, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న శేఖర్

జంగారెడ్డిగూడెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చనిపోయిన అనాథ వృద్ధురాలికి సీతామహాలక్ష్మి అనాథ ఆశ్రమ నిర్వాహకుడు జయవరపు శేఖర్ అంత్యక్రియలు నిర్వహించాడు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కోడూరి శకుంతల(94)లను వృద్ధాప్యంలో ఉందని పట్టించుకునేవారు లేరని నాలుగేళ్ల క్రితం స్థానిక సీతామహాలక్ష్మి అనాథ ఆశ్రమ నిర్వాహకుడు శేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారమందింది. అనారోగ్య సమస్యలున్న ఆ వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్చుకుని ఆమెకు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించాడు. చివరకు ఆ వృద్ధురాలు ఆదివారం మృతి చెందడంతో ఆమె దూరపు బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించాడు. ఆశ్రమ నిర్వాహకుడి సేవలను పలువురు కొనియాడారు.

వారాహిమాం భ్రమరాంబ దర్శనం

ఏలూరు రూరల్ : మాదేపల్లిలో ఉన్న శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో వారాహి గుప్త నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం భ్రమరాంబ దేవి వారాహి మాతగా అలంకరించారు. జూలై 4వ తేదీ వరకు మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు కృష్ణచైతన్య శర్మ తెలిపారు.



సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : ఏఐటీయూసీ

ఏలూరు కార్పొరేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం జూలై 9న జరిగే సర్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు, కె.కృష్ణమాచార్యులు, రెడ్డి శ్రీనివాస డాంగే, పళ్ళెం కిషోర్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయం వద్ద పలు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో కార్మికులు ఐక్యతను నిరూపించాలని, పోరాడి సాధించుకున్న హక్కులను పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు.

పవన్‌ను సీఎంగా చూడాలన్నదే ఆకాంక్ష



ఏలూరు రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కీలక అంశాలపై చర్చ జరిగింది. సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై సమాలోచన చేశారు. సమావేశానికి ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రాష్ట్ర ప్రజలు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రిగా చూడాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏలూరులోని 50 డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలన్నారు. లోటుపాట్లు ఉంటే సమన్వయంతో సరిచేసుకుని ముందుకు సాగాలన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జనసేన నాయకుడు నారా శేషు, దోనేపూడి లోవరాజు, నిమ్మల జ్యోతికుమార్, ఇళ్ళ శ్రీనివాస్, కస్తూరి సాయి తేజస్విని, ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, రెడ్డి గౌరీశంకర్, వీరంకి పండు, నగిరెడ్డి కాశీ నరేష్ పాల్గొన్నారు.

శ్రీరాట్నాలమ్మకి ప్రత్యేక పూజలు



పెదవేగి జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా రుసుమలు ద్వారా రూ.41,100, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.29,805, ఫొటో విక్రయాల ద్వారా రూ.5,545లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

మానవత ఆర్థిక సాయం పెంచుదాం

ఉంగుటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో మానవత సంస్థలో సభ్యత్వాలు పెంచడంతో పాటు పేదలకు ఆర్థిక సాయం పెంచాలని మానవత రీజియన్ చెర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం ఉంగుటూరులో జరిగిన మానవత సమావేశానికి మండలాధ్యక్షులు కోనే వి.వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, దొంతంశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి రాజాని సతీశ్, గంజి రవి, బొమ్మిడి అప్పారావు,శీతాల సత్యనారాయణ, రామిరెడ్డి వెంకట రెడ్డి,మందా జయలక్ష్మి పాల్గొన్నారు.

నిడమర్రులో: ఆదివారం నిడమర్రు మండలంలో కార్యదర్శి అంతర్వేది ఇంటి వద్ద జరిగిన సమావేశంలో సభ్యత్వాలు తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశంలో కోశాధికారి కాన్వెంట్ శ్రీను, ఛైర్మన్ సంకు సత్యకుమార్, జిల్లా సహకార అధ్యక్షులు జానకిరామ రాజు, గాజుల నాగేశ్వరరావు, అలుమోలు ప్రసాద్, అప్పారావు, కృష్ణ, కోడూరి మణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు కృష్ణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



ఏలూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్య, సామాజిక రంగాల్లో చేసిన సేవలకుగాను ఏలూరుకు చెందిన ఉపాధ్యాయుడు జి.కృష్ణకు ఆదివారం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ నిర్వాహకులు గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఏజెన్సీ మండలాల్లో నిరుపేద గిరిజన విద్యార్థులకు స్కూలు ఫీజులు కట్టడం, పేద కుటుంబాలకు నిత్యావసరాలు, ఆర్థికసాయం అందజేయడం, తదితర సేవా కార్యక్రమాలను ఈయన నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని కృష్ణ మాస్టారు అందుకున్నారు. కృష్ణకు గౌరవ డాక్టరేట్ ప్రకటించడం పట్ల ఏపీటీఎఫ్-1938, ఎంఈవోల సంఘం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మోహన్‌రావు, రామ్మోహన్‌రావు, టి.వి.రామకృష్ణ, తదితరులు అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడమర్రు(ఉంగుటూరు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): నిడమర్రు సెక్షన్ పరిధిలోని మంగళ వారం కొత్త లైన్ పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండింటి వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యు త్ శాఖ ఈ.ఈ.అంబేద్కర్ తెలిపారు. నిడమర్రు, గుణపర్రు, కంద్రిక, పెద నింద్రకొలను, చిన నింద్రకొలను, తోకలపల్లి, బైనేపల్లి, దేవరగో పవరం ప్రాంతాలకు సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

నక్కినవారిగూడెం పరిధిలో..

● టి.నర్సాపురం: నక్కినవారిగూడెం పరిధిలోని సున్నపురాళ్లపల్లి ఫీడర్‌కు, టి.నర్సాపురం పరిధిలోని ఆర్.కె.ఆర్.గూడెం ఫీడర్ల పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ నెల 30 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

నిరుపయోగంగా వాటర్ ఫౌంటేన్‌లు



నిర్వహణలేక ఆగిపోయిన నీరు

ఏలూరుటూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగరంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన వాటర్ ఫౌంటేన్‌లు నిరుపయోగంగా మారాయి. నగరంలో నాలుగు కూడళ్లలో సుమారు కోటి 50లక్షలతో నాలుగు వాటర్ ఫౌంటేన్‌లు నిర్మించారు. రెండేళ్ల క్రితం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద వాటర్ ఫౌంటేన్ నిర్మించి అక్కడ ఐ లవ్యూ ఏలూరు అని ఎలక్ట్రిక్ సైన్‌బోర్డు నిర్మించారు. కొంతకాలం పాటు నీటితో ఫౌంటేన్‌లు నిర్వహిం చారు. ఆ తరువాత వాటిని పట్టించు కున్న నాథుడేలేడు. జూట్‌మిల్లు వద్ద, అశోక్‌నగర్, తంగెళ్లమూడి కూడళ్లలో వాటర్ ఫౌంటేన్లు నిర్మించి కొద్దికాలం పాటు వాటిని నిర్వహించారు. నగరపాలక సంస్థ అధికారులు ఫౌంటేన్లను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.





నీళ్లులేక వెలవెలబోతున్న ఫౌంటేన్‌లు

తట్టా బుట్టా సర్దుకుని!

(5వ పేజీ తరువాయి)

ఖాతాల్లో పోలవరం పరిహారాలు జమ చేసిన ప్రభుత్వం మిగిలిన వారి విషయంలో ఆరునెలలు గడుస్తున్నా పరిహారాలు జమ చేసే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తాము ఇప్పుడు గ్రామాలను ఖాళీ చేసి వెళితే తమకు పరిహారం అందుతుందో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా ఈ విషయంలో స్పష్టమైన హామీని ఇవ్వలేకపోతున్నారు. ఏది ఏమైనా రానున్న మూడు నెలల పాటు గోదావరి వరదల కారణంగా మండల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుందన డంలో ఎలాంటి సందేహం లేదు

జీవాలను రక్షించుకోండి

నట్టల నివారణ మందులపై పశు వైద్యుల అవగాహన - రోగాలు రాకుండా చూసుకోవాలని సూచన



టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరుటూటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు గొర్రెలు, మేకలు పెంచుకుని వాటిద్వారా కుటుంబాన్ని పోషించుకుంటూ ఆర్థికంగా బలపడుతుంటారు. చిన్నజీవాలను ఆరోగ్యకరంగా పెంచుకునేందుకు పశుసంవర్థక శాఖ ఎప్పటికప్పుడు వ్యాక్సీన్లు, మందులు అందిస్తోంది. ప్రభుత్వం సూచించిన విధంగా పెంపకం దారులు మందులు, వ్యాక్సీన్‌లు వేయించుకోవడం ద్వారా మూగజీవాలను ఆరోగ్యకరంగా ఉంచుకోవచ్చు. మేకలు, గొర్రెల్లో నట్టల వ్యాధి ప్రధానం. దీన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా నట్టలనివారణ కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారు. ఈ మందులు గొర్రెలు, మేకల్లోని పరాన్నజీవుల నుంచి రక్షిస్తాయి. ఈ నట్టలవ్యాధి అంతరపరాన్నజీవులు శరీరం, కాలేయం, ఊపిరితిత్తులు, ప్రేగులు, జీర్ణాశయం, మేదడు, అంతర్గత అవయవాల్లో స్థావరం ఏర్పారుచుకుంటాయి. ఈ అంతరపరాన్నజీవులు గొర్రెలు, మేకల్లోని పోషక పదార్థాలను నిర్వీర్యం చేయడమే కాకుండా రక్తాన్ని కూడా పీల్చుకుని రక్తహీనతకు గురిచేస్తాయి. దీంతో జీవాలు బరువు తగ్గి ఎంత ఆహారం తిన్న చిక్కిపోతుంటాయి. ఈ అంతరపరాన్నజీవుల వలన జీవాలలో విరేచనాలు, దవడక్రింద నీరు చేరడం, పొట్ట లావు అవ్వడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలుంటాయి. రైతులు గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. ఈ నట్టల నివారణ మందులు సంవత్సరానికి నాలుగుసార్లు మూడు నెలలకు ఒకసారి పశుసంవర్ధక శాఖాధికారులు నట్టల నిర్మూలన మందులు తాగిస్తారు. ముఖ్యంగా జీవాల మరణ శాతం చిన్న వయస్సు ఉన్న చిన్నపిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 26న ఏలూరు జిల్లాలో ప్రారంభించారు. జూలై 10వ తేదీ వరకు నట్టల నివారణ మందులు మూగజీవాలకు అందిస్తారు. జిల్లాలో 5లక్షల 79వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి. వీటన్నిటికి నట్టల నివారణ మందులు ఉన్నాయి. ఈ అవకాశాన్ని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి.

మూడు నెలలకు ఒకసారి మందులు వాడాలి



గొర్రెలు, మేకల్లో నట్టల వ్యాధి నివారణకు ప్రతీ 3నెలలకు మందులు సరఫరా చేస్తున్నాం. వ్యాధి ఉన్న లేకపోయిన నట్టల నివారణ మందులు తాగించాలి. మందులు తాగించిన అనంతరం జీవాల్లో అంతర పరన్నజీవులు చనిపోతాయి. దీంతో ఆకలి పెరిగి తిన్నతిండి వంటపడుతుంది. మందుతాగించిన జీవికి పరాన్నజీవులు దరి చేరవు. జూలై 10వ తేదీ వరకు మందులుపంపిణీ జరుగుతుంది. ఈ అవకాశాన్ని పెంపకం దారులు వినియోగించుకోవాలి.

డాక్టర్ టి.గోవిందరాజు,
జాయింట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ

ఫీల్డ్ ఆఫీసర్ బుచ్చయ్యకు ఉద్యోగ విరమణ సత్కారం



బుచ్చయ్య దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటవ పొగాకు వేలం కేంద్రంలో బి.బుచ్చయ్య ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వర్జీనియా పొగాకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే.ప్రసాద్ మాట్లాడుతూ బుచ్చయ్య సేవలు ఎనలేనివని కొనియాడారు. ఎంతో మంది రైతులతో సుదీర్ఘ కాలం పాటు పని చేసిన బుచ్చయ్య తన శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని సూచించారు. ఎందరో రైతుల మన్ననలను పొందిన బుచ్చయ్యను అంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే వేలం అధికారి శ్రీహరితో పాటు పలువురు రైతు సంఘ నాయకులు, రైతులు ఆయన సేవలను కొనియాడారు.అనంతరం బుచ్చయ్య,రమణమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జిఒ.సుధీర్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, వర్జీనియా పొగాకు రైతు సంఘ నాయకులు గడ్డమణుగు దత్తుడు, గద్దే లక్ష్మణరావు, కరాటం రెడ్డిబాబు నాయుడు, పరిమి రాంబాబు, ఘంటసాల గాంధీ, వామిశెట్టి హరిబాబు, అల్లూరి రామకృష్ణ, సుంకవల్లి వీరభద్రరావు, గద్దే రాజేంద్ర ప్రసాద్, ఆకుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.





గోతుల్లో నీళ్లు నిలిచిపోయి అధ్వానంగా ఉన్న రోడ్డు

పెదపాడు - వట్లూరు రోడ్డు అధ్వానం

మరమ్మతులు చేపట్టాలని ప్రజల వేడుకోలు

పెదపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెదపాడు బస్టాండ్ ఎదురుగా ఉన్న పెదపాడు-వట్లూరు రహదారి పూర్తిగా ధ్వంసమై గోతులు పడ్డాయని, చిన్నపాటి వర్షానికే ఆయా గోతుల్లో వర్షపునీరు చేరి ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రహదారి మొత్తం పెద్దమొత్తంలో గోతులు పడి, రాళ్లు లేచి చిందరవందరగా ఉందని, ఈ రహదారిలో నిత్యం కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటుగా నిత్యం రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనుల కోసం ఇటుగా ప్రయాణం సాగిస్తుంటారు. అలాగే వట్లూరు, పరిసర గ్రామాల ప్రజలు మండల కేంద్రం చేరుకోవడానికి ఇదే దగ్గర దారిగా ఉంది. ప్రయాణానికి అనుకూలంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.





సమావేశంలో పాల్గొన్న ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే చంటి



జంగారెడ్డిగూడెంలో సమావేశం దృశ్యం

సుపరిపాలన - ఇంటింటికీ అందజేస్తాం

ఏలూరుటూటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకెళ్లి విజయవంతం చేయాలని ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే చంటిలు పాల్గొన్నారు. అనంతరం వారు ఇరువురు మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథి నుంచి ప్రతి ఒక్క టీడీపీ కుటుంబ సభ్యుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడాది కూటమి పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలను ఐ.టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం వల్ల ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల పని తీరు తెలుస్తుందన్నారు. నెలరోజుల పాటు విధిగా ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరారు.

● జంగారెడ్డిగూడెం: జూలై 2 నుంచి జరిగే సుపరిపాలన-ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చింతలపూడి నియోజకవర్గ పార్టీ కో-ఆర్డినేటర్ ఎస్.మోషే, పట్టణ అధ్యక్షు డు కొండ్రెడ్డి కిశోర్ పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, వార్డు కమిటీలకు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మోషే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు నాలుగేళ్లలో చేయబోయే పనులు కూడా వివరించాలని సూచించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నాయకులు పెనుమర్తి రామ కుమార్, షేక్ ముస్తఫా, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, గుమ్మడి ప్రసాద్, మహంకాళి రాంబాబు, గుళ్లపూడి శ్రీదేవి, రామాంజనేయులు, తూటిగుంట రాము, దుర్గారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



విద్యార్థులతో దేవాంగ సంఘ సభ్యులు

ఏలూరు రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఏలూరు శ్రీబాల త్రిపురసుందరి సోమలింగేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి, ఇంటర్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ముఖ్య అతిథిగా ఏపీ రాష్ట్ర దేవాంగ సంఘ అధ్యక్షులు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావు, గౌరవాధ్యక్షులు బొమ్మన దుర్గాప్రసాద రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏలూరు దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రా వీర్రాజు, యర్రా సోమలింగేశ్వరరావు, మరకా శివయ్య, ఆల్‌ఇండియా ఎడ్యుకేషనల్ వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, ఏలూరు 36వ డివిజన్ కార్పొరేటర్ సోము శారద, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ద్వారకాతిరుమల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 1991-92 లో టెన్త్ పూర్తిచేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు హెచ్‌ఎంగా పనిచేసిన ఎస్.వి.వేణునాథ్, తెలుగు మాస్టారు జగన్నాథరావు, పీఈటీగా పనిచేసిన రాజు, శేషు కుమార్‌లను ఘనంగా సత్కరించారు. చదువుకునే సమయంలో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుని ఆనందంగా గడిపారు.

భారతీయ సంవిధాన్ హత్య దివస్

జంగారెడ్డిగూడెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్ అధ్యక్షతన భారతీయ సంవిధాన్ హత్య దివస్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 1975 నుంచి 1977 వరకు దేశంలో చీకటి రోజులని బీజేపీ సీనియర్ నాయకుడు కొప్పాక శ్రీనివాసరావు అన్నారు.ఇందిరాగాంధీ ప్రధానిగా నిరంకుశ పాలన అందించారని ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సూరంపూడి సుబ్బరాయ శర్మను కాకినాడలో విద్యనభ్యసిస్తున్న సమయంలో అరెస్టు చేసి ఆరునెలలు జైల్లో పెట్టారని గుర్తు చేశారు. ఆనాడు జైలు జీవితం అనుభవించిన సూరంపూడి సుబ్బరాయ శర్మను బీజేపీ నాయకులు సత్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి రామలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొంచాడ దేవేంద్ర,సునీల్ దత్తు సాహు, సొలస రవికుమార్, బ్రహ్మజీ, తిప్పాభట్ల రామకృష్ణ, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

పెదపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో కోడిపందాలు వేస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్టుగా పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు. వీరి నుంచి రెండు కోడిపుంజులు, రూ.3,500లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాటలు ఆడుతున్నట్టు సమాచారం తెలిస్తే వెంటనే 94407 96637 నెంబరుకు తెలియజేయాలని ఎస్.ఐ. సతీష్ కోరారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు, అర్చనలు



ఏలూరుకార్పొరేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పవర్‌పేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్యభగవాన్ స్వామి ఆలయంలో ఆషాఢం తొలి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు జరిపారు. ఆలయ అ ర్చకులు రాళ్ళబండి ఆదినారాయణ శర్మ భక్తులకు వనమూలికల తీర్థాన్ని పంపిణీ చేశారు. ఆలయ ఈవో నెహ్రూ, ఆలయ ఛైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణ చంద్రరావు మిత్రబృందం భక్తులకు సేవలందించారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

పెదవేగి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన పలువురు ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కారానికి అనువుగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రాష్ట్రంలోని రహదారులను అభివృద్ధి చేశామని, మిగిలిన రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండింటినీ సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించామని ప్రభాకర్ వివరించారు.



విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

హెచ్ఎం వడ్లపట్ల విజయలక్ష్మికి ఉద్యోగ విరమణ సత్కారం

దెందులూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయురాలిగా వడ్లపట్ల విజయలక్ష్మి విద్యాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని ఎంఈవో ఆకేళ్ల వెంకటనాగవర ప్రసాద్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వడ్లపట్ల విజయలక్ష్మిని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ద్వారకా తిరుమల, దెందులూరు మండలాల్లో హెచ్‌ఎంగా పని చేసి ఎంతోమంది విద్యార్థులను సక్రమైన మార్గంలో పెట్టారన్నారు. దెందులూరు క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ వడ్లపట్ల విజయ్ కుమార్, కట్నేని అమృత సరోజిని, పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు వడ్లపట్ల విజయలక్ష్మీ దంపతులను ఘనంగా సన్మానించారు. పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపవాస పండుగలు ప్రారంభం

దెందులూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేవుడికి దగ్గరగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండటమే మంచి జీవనమని ప్రముఖ దైవజనులు బెయేర్షెబా మినిస్ట్రీస్ చర్చిల అధినేత బ్రదర్ కె. సాల్మన్ రాజు అన్నారు. సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని వీరభద్రపురం చర్చి దేవాలయంలో దైవజనులు బ్రదర్ సల్మాన్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం 50రోజుల ఉపవాస పండుగలను బ్రదర్ సాల్మన్‌రాజు ప్రారంభించారు. అనేక మంది విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

దాసు సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా పల్లం సంధ్య

కుక్కునూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దాసు సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పల్లం సంధ్యారాణి, భట్టు కమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉప్పేరులో దాసు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లం రవికుమార్ మాట్లాడుతూ సామాజికవర్గ ఐక్యతకు, అభివృద్ధికి తోడ్పడుతూ దాసు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏర్పాటు చేశారు. పాముల ప్రసాద్, జెట్టి రామకృష్ణ, పల్లం పార్వతి, లక్ష్మణరావు, నారాయణదాసు, నరసింహరావు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ఎన్నికల హామీను వెంటనే నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని నిరుద్యోగులు జాబ్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. ఎం.అశోక్, సురేష్, పోతురాజు, శివమణి, నరేష్, సూరిబాబు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఆంజనేయులు

పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయుడి ఇంటింటి ప్రచారం

లింగపాలెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందిస్తోందని ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. సింగగూడెంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు కూడా సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

లింగపాలెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి):ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పని సరిగాహెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న వాహనదారులకు సూచించారు. మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. సారా, గంజాయి, మద్యం వంటివి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్‌లు వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఏలూరుటూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్ తెలిపారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు. నగర పాలక సంస్థకు సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు.



ఎన్నికైన నూతన అధ్యక్షులు

సొసైటీ అధ్యక్షుల ఎంపిక

పోలవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కొత్త పట్టిసీమ, పాతపట్టిసీమ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పూడి అప్పారావు, నునకాని రాంబాబు ఎంపికయ్యారు. కొత్తపట్టిసీమ సొసైటీ అధ్యక్షుడిగా పూడి అప్పారావు, పాతపట్టిసీమ సొసైటీ అధ్యక్షుడిగా నునకాని రాంబాబు ఎన్నికయ్యారు. వారికి ఏపీ ట్రైకార్ చైర్మన్ టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, నియోజవర్గ బీసీ సంఘ అధ్యక్షులు దోకల నాగేశ్వరరావు, పట్టిసీమ సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, జితేంద్ర శుభాకాంక్షలు తెలిపారు.

కైకలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సోమవారం కైకలూరు మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కైకలూరు చేరుకుని అక్కడి నుంచి మండలంలోని కొల్లేరు గ్రామాలైన శృంగవరప్పాడు, పందిరిపల్లిగూడెం తదితర గ్రామాల్లో పర్యటించనున్నారు. పర్యటన వివరాలను కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ పర్యటనలో కైకలూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు.

ఆంధ్రజ్యోతి **నూజివీడు**
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● సోమవారం 30 జూన్ 2025

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం పల్లెవాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయా గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా రైతులు గమనించి సహకరించాలని కోరారు.



పెదలంక - మూల్లంక రహదారిపై వరి నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రహదారిపై నాట్లు వేసి సీపీఎం నిరసన

కలిదిండి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గోతులుపడి అధ్వానంగా ఉన్న పెదలంక-మూల్లంక రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం ఆ రహదారిపై ధర్నా నిర్వహించారు. రహదారిపై గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు రహదారిపై గోతుల పడి ధ్వంసమవటంతో వాహనాలు దిగబడుతున్నాయని, బస్సుల రాకపోకలకు అంతరాయం కలగటంతో విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి క్షతగాత్రులతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు శేషపు మహంకాళిరావు, డీవీ సత్యనారాయణ, బి.నాగేంద్ర రావు, వి.భాస్కరరావు, ఎస్.మహాలక్ష్మి, జి.అనిల్ కుమార్, రైతులు కె.వెంకట సుబ్బారావు, బి.అప్పారావు, డి.సీతయ్య తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ దాగురే విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్ల నివాళి

ఘనంగా కెమెరా దినోత్సవం

కైకలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కెమెరా సృష్టికర్త డాగురే వల్ల ప్రపంచంలో మారుమూల ఉన్న వాటిని కూడా నేడు చూడగలుగుతున్నామని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సాగర్‌బాబు అన్నారు. జాతీయ కెమెరా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కైకలూరులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద లుయిస్ డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కెమెరాను సృష్టించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా కెమెరా ద్వారా చిత్రీకరించిన జ్ఞాపకాలను చూడగలుగుతున్నామన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు మిఠాయిలు పంచారు. గౌరవ అధ్యక్షుడు టీఎన్ ఆచారి, సభ్యులు చాబత్తిన ప్రేమ్, సుంద్రు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో సేవ్యాను సన్మానిస్తున్న దృశ్యం

ముదినేపల్లి ఎంఈఓ సేవ్యానాయక్‌కు సత్కారం

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఎంఈవో-1గా విధులు నిర్వహించి ఈ నెలాకరుకు రిటైర్ కానున్న ఎం.సేవ్యా నాయక్‌ను పెయ్యేరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ సన్మానించారు. నూజివీడు ఇన్‌చార్జ్ డీఈవోగా వ్యవహరిస్తున్న సేవ్యా నాయక్‌కు ఆదివారం జరిగిన సత్కార సభలో ముదినేపల్లి మండల ఏపీటీఎఫ్ తరఫున రాజేంద్ర ప్రసాద్ ఆయన్ని సన్మానించారు. ముదినేపల్లి మండల రిసోర్స్ సెంటర్ ఉద్యోగి ఫణి కుమార్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పేకాట జోరు!

ఆంధ్ర, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా జూదం

కుక్కునూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో మళ్లీ పేకాట జోరుగా సాగుతోందనే ప్రచారం జరుగుతోంది. కుక్కునూరు మండలంలో వేలేరు శివారు గ్రామపంచాయతీలోని అటవీ ప్రాంతంలో రోజుకోచోట పేకాట స్థావరం ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా పేకాట ఆడటం ఎప్పటి నుంచో ఉంది. పత్రికల్లో వార్తలు వచ్చినా, పోలీసులు నిఘా పెట్టిన సమయంలోనూ కొన్ని రోజుల పాటు పేకాటకు విరామం పలికి మళ్లీ కొనసాగించటం ఇక్కడ మామూలుగా జరుగుతూనే ఉంది. తెలంగాణకు చెందిన కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో పేకాటను నిర్వహిస్తుండగా అందుకు కొందరు స్థానికులు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల మరలా పేకాట మొదలైందనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా తెలంగాణలోని పలు ప్రాంతాలకు చెందిన జూదరులు ఇక్కడ జరిగే పేకాటకు తరలివస్తున్నారని సమాచారం. కుక్కునూరు మండల కేంద్రానికి దాదాపుగా 40 కిలోమీటర్ల దూరంలో ఈ పేకాట జరుగుతుండడంతో వారికి అవకాశంగా మారింది. పోలీసులకు పేకాట జరుగుతున్నట్టు సమాచారం అంది అక్కడకు వెళ్లేలోపే జూదరులు ఏర్పాటు చేసుకున్న నిఘాతో వెంటనే వారికి సమాచారం వెళ్లిపోతుంది. గతంలో ఇక్కడ భారీస్థాయిలో జరుగుతున్న పేకాట స్థావరంపై ఏలూరు నుంచి ప్రత్యేక స్క్వాడ్ బృందం వచ్చి దాడి జరిపారు. ఈ దాడిలో వేలాది రూపాయలు నగదు, వాహనాలు, పలువురు ప్రముఖులు పట్టుబడ్డారు. అయినప్పటికి ఈ శివారు ప్రాంతంలో పేకాట జరగడం నిత్యకృత్యమైంది. పోలీస్ శాఖ నిఘా పెంచి దాడులు చేస్తేనే పేకాట నిర్వహణ నిలుస్తుందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న జూదంలో వేలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు సమాచారం.

తట్టా బుట్టా సర్దుకుని!

(5వ పేజీ తరువాయి)

ఖాతాల్లో పోలవరం పరిహారాలు జమ చేసిన ప్రభుత్వం మిగిలిన వారి విషయంలో ఆరునెలలు గడుస్తున్నా పరిహారాలు జమ చేసే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తాము ఇప్పుడు గ్రామాలను ఖాళీ చేసి వెళితే తమకు పరిహారం అందుతుందో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా ఈ విషయంలో స్పష్టమైన హామీని ఇవ్వలేక పోతున్నారు. ఏది ఏమైనా రానున్న మూడు నెలల పాటు గోదావరి వరదల కారణంగా మండల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుందన డంలో ఎలాంటి సందేహం లేదు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475



విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్అండ్‌బీ రహదారి ఇదే

నిరీక్షణకు తెర

ఏలూరు- ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారికి మోక్షం

రూ. 18 కోట్లతో వీవీ రోడ్డు విస్తరణ

మంత్రి పార్థసారథి చొరవతో నిధులు మంజూరు

చాట్రాయి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు-ఎన్టీఆర్ జిల్లాలను కలిపే విస్సన్నపేట-వెలగలపల్లి రహదారి (వీవీ రోడ్డు) విస్తరణకు నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో నరసాపురం నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు వరకు 15 కిలోమీటర్ల దూరం సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించటానికి ప్రభుత్వం రూ. 18 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు నూజివీడు ఆర్అండ్‌బీ డీఈఈ బాబూరావు తెలిపారు. రెండు జిల్లాలను కలిపే రహదారి కావటంతో నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు దశాబ్దాల నుంచి ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా ఫలితం కలగలేదు. ఇరుకు రోడ్డులో నిత్యం వాహన చోదకులు, ప్రజల ఇబ్బందుల వర్ణనాతీతం. సరైన రహదారి సౌకర్యం లేక ఈ ప్రాంతం బాగా వెనుకబడి ఉంది. ఈ రోడ్డు విస్తరణ అవశ్యకతను తెలియజేస్తూ 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితయ్యాయి. ఆలస్యంగానైనా నిధులు మంజూరు కావటంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

టెండర్ పూర్తి కాగానే పనులు

విస్సన్నపేట- వెలగలపల్లి రహదారి (వీవీ రోడ్డు) విస్తరణకు ప్రభుత్వం రూ. 18 కోట్లు మంజూరు చేసింది. టెండరు ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపతాం.

- బాబూరావు, డీఈఈ, ఆర్అండ్‌బి శాఖ, నూజివీడు

ముదినేపల్లి మండలంలో..

యూపీ స్కూళ్లను కొనసాగించండి

మంత్రి లోకేశ్‌కు టీడీపీ నాయకుల వినతి

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డీగ్రేడ్ చేసిన కారణంగా ప్రాథమిక పాఠశాలలుగా మారిన ముదినేపల్లి మండలంలోని తొమ్మిది మండల పరిషత్ యూపీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ నాయకులు కోరారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కలసి మండలంలో యూపీ పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పు చేయడం వల్ల ఆ పాఠశాలల విద్యార్థులు 6, 7, 8 తరగతులు చదివేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న హైస్కూళ్ళకు వెళ్ళడానికి ఎదురయ్యే ఇబ్బందులను మంత్రికి వివరించి మెమొరాండం అందజేశారు. మండలంలోని కోడూరు, దాకరం, చినకామనపూడి, వణుదుర్రు, కొరగుంటపాలెం, యూపీ పాఠశాలల స్థాయి తగ్గించి ప్రాథమిక పాఠశాలలుగా మార్చడం వల్ల ఆయా పాఠశాలల విద్యార్థులు 4 నుంచి 9 కిలోమీటర్ల దూరంలోని హైస్కూళ్ళకు వెళ్ళాల్సి వస్తున్నదని, ఇది చాలా ఇబ్బందికరమని మంత్రికి వివరించారు. మండలంలో ఒక్క యూపీ స్కూలు కూడా లేదని చెబుతూ, పక్క నియోజకవర్గాల్లో ఒక్క యూపీ స్కూలును కూడా డీగ్రేడ్ చేయలేదని తెలిపారు. విద్యాశాఖ అధికార్లు అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల వందలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పగా విషయాన్ని పరిశీలించాలని అధికార్లను మంత్రి లోకేశ్ ఆదేశించారని వినోద్ తెలిపారు.



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

అన్నదానానికి విరాళం

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి ఆలయ ప్రధాన అర్చకుడి కుమారుడు తోలేటి మోహన శ్రీసాయి కాశీకార్తికేయ శర్మ రూ. 10,116లు విరాళం అందజేశారు. విరాళాన్ని ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవికి అందించారు. అనంతరం దేవస్థానం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు ముదినేపల్లి మండల టీడీపీ కమిటీ ఎన్నిక

అధ్యక్ష పదవికి పోటీ..? మద్దతు సమీకరణలో నాయకులు, అభ్యర్థులు

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముదినేపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరగనుంది. స్థానిక 'వి' కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న పార్టీ మండల సమావేశంలో కైకలూరు నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకుడు పెద్దిబోయిన వాణి శివ ప్రసాద్, పార్టీ మండల ఎన్నికల పరిశీలకుడు రెడ్డి సూర్య చంద్రరావు ఎన్నిక నిర్వహించనున్నారు. మండల కమిటీ అధ్యక్ష పదవికి పోటీ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండల టీడీపీ నాయకులు ఈ పదవిని తమ వర్గానికి దక్కించుకునేందుకు రంగంలోకి దిగారు. ఎవరి ప్యానల్‌ను వారు సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో పర్యటించి గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, యూనిట్ కన్వీనర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు మండల కమిటీ అధ్యక్షుడిగా మూడు సార్లు వ్యవహరించిన చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నాయకులు బొర్రా చలమయ్య, కోడూరు శేషుబాబు తదితరులు మండల కమిటీ అధ్యక్ష పదవికి పెదగొన్నూరు గ్రామానికి చెందిన గుడివాడ వేణుగోపాలస్వామిని రంగంలోకి దింపి మద్దతును సమీకరిస్తుండగా, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తదితరులు ములకలపల్లికి చెందిన బొప్పన సుందర రామయ్యను మండల అధ్యక్ష పదవికి రంగంలోకి దింపి మద్దతు కూడా గట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ బీసీ వర్గానికి అధ్యక్ష పదవి ఇవ్వాల్సి వస్తే వణుదుర్రు నీటి సంఘం అధ్యక్షుడు పోసిన పాండు రంగారావును వినోద్ వర్గం రంగంలోకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ముదినేపల్లి మండల కమిటీ ఎన్నిక రసవత్తరంగా మారింది.

వృద్ధురాలిపై దాడి.. ఆభరణాల చోరీ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రవికుమార్

కైకలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఆగంతుకుడు దాడి చేసి ఆభరణాలు దోచుకున్న ఘటన సంచలనం రేపింది. కైకలూరు మండలం రామవరంలో శనివారం రాత్రి గ్రామానికి చెందిన గుడూరు నాగలక్ష్మి (62) భోజనం చేసి ఇంటి ఆరుబయల నిలబడింది. ఆగంతుకుడు వెనుక వైపు నుంచి వచ్చి తలకు ముసుగు వేసి దాడి చేశాడు. కేకలు వేయకుండా అడ్డుకుని ఆమె చేతికి ఉన్న రెండు బంగారు గాజులు, మెడలోని చైన్ మొత్తం 8 కాసుల ఆభరణాలను దొంగలించి పారిపోయాడు. కొద్దిసేపటికి ఆమె కోలుకుని ఇరుగు పొరుగు వారిని పిలిచి విషయం చెప్పగా కైకలూరు రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. నాగలక్ష్మికి ఒక కుమార్తె ఉండగా ఆమె చెన్నైలో ఉంటోంది. ఈమె ఒంటరిగా రామవరంలో నివాసం ఉంటోంది. ఒంటరిగా ఉండడాన్ని గుర్తించి చోరీకి పాల్పడినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్, రూరల్ ఎస్సై వి. రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న టాటా ఏస్ వాహనం

ఐదుగురికి స్వల్ప గాయాలు



చెక్కపల్లి ప్రధాన రహదారిపై పడిన టాటా ఏస్

ముసునూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావుల పాలేనికి చెందిన టాటా ఏస్ వాహనం రమణక్కపేట వైపు వెళుతున్న క్రమంలో నూజివీడు మండలం నెహ్రూనగర్‌కు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు చెక్కపల్లి వైపు వస్తుండగా అతివేగంతో టాటా ఏస్ వాహనం ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ఉన్న నలుగురు వ్యక్తులతోపాటు టాటా ఏస్ వాహనంలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో టాటా ఏస్ వాహనం పక్కకు పడిపోగా, రెండు బైక్‌లు దెబ్బ తిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.



బాధితుడికి డాక్టర్ మనోజ్ ఆర్థిక సాయం

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామంలో శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఆళ్ల వీరుడు అనే వృద్ధుడి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. వంట చేసుకునేందుకు స్టవ్ వెలిగించి అతను బయటికి వచ్చిన కాసేపటికి సిలిండర్ పేలిపోయింది. మంటలు ఇంటికి వ్యాపించి ఇల్లు దగ్ధమవుతున్నప్పటికీ ఆ వృద్ధుడు మంటలు ఆర్పే ప్రయత్నం చేయలేక పోయాడు. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమై సామగ్రి కాలి బూడిదైంది. బాధితుడికి అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ రూ.5 వేల నగదు, వంట సామగ్రి ఆదివారం అందజేశారు. స్థానికులు కూడా అతనికి సాయం అందించారు.

కనుమరుగవుతున్న ఎడ్ల బండ్లు



సైసై జోడెడ్ల బండి.. షోకైన దొరల బండి, ఇప్పుడు కనుమరుగుకు అతి చేరువలో ఉంది. ఆనాడు గ్రామాల్లో ప్రతి ఇంటికి ఎడ్లబండి ఉండేది. అప్పట్లో మంచి ఎడ్లజత బండి ఉండడం సామాజిక హోదాగా రైతు కుటుంబాలు భావించేవారు. ప్రతి ఇంటికి ఎడ్లబండి ఉండేది. రైతు కుటుంబాలు ఎద్దులను కన్న బిడ్డల్లా చూసుకునేవారు. పల్లెటూరులలో ఎడ్లబండిపై వెళుతూ మంచి అనుభూతిని పొందేవారు.

- నాడు పల్లెటూరులో ప్రతి ఇంటా దర్శనం
- వ్యవసాయ యాంత్రీకరణతో వినియోగించేవారు కరువు
- భారమైన పశుపోషణతో స్వస్తి చెప్పిన అన్నదాతలు

చాట్రాయి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో సేద్యం మొదలైన దగ్గర నుంచి రైతులకు చేదోడుగా ఉన్న ఎడ్లబండ్లు యాంత్రిక విప్లవంతో కనుమరుగుకు దగ్గరలో ఉండడం బాధించే విషయమని వృద్ధ రైతులు ఆవేదన చెందుతున్నారు. పశువుల ఎరువు పొలాలకు తరలించడం, ఎరువులు వ్యవసాయ పనుముట్లు సాగు భూముల్లోకి తీసుకువెళ్లడానికి, పంటలు, వరిగడ్డి ఇళ్లకు తెచ్చుకోవడానికి తదితర పనులకు ఉపయోగించేవారు. అసలు ఎడ్లబండి లేకుండా వ్యవసాయం నడిచేది కాదు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్లు

పెళ్లిళ్లకు, తీర్థయాత్రలకు ఎడ్లబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. వీధిలో ఒక ఇంట్లో పెళ్లి అయితే ఆ వీధిలో ఉండే ఎడ్లబండ్లు అన్నీ కట్టి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించేవారు. వ్యవసాయంలోకి ట్రాక్టర్లు రంగప్రవేశం తరువాత ఎడ్లబండ్లు వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చి ఇప్పుడు పూర్తిగా కనుమరుగు అవుతున్నాయి. 25 ఏళ్ల క్రితం వరకు గ్రామాల్లో భూస్వాములకు, పెద్ద రైతులకు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. చిన్న రైతులు ఎడ్ల బండితోనే వ్యవసాయం చేసుకునేవారు.

యాంత్రీకరణతో పెరిగిన ట్రాక్టర్లు

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రామాల్లో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, బ్యాంకులు ఐదు ఎకరాలు భూమి ఉన్న రైతులకు కూడా ట్రాక్టర్లు కొనుగోలుకు రుణాలు ఇవ్వడంతో అన్ని ఊర్లలో ట్రాక్టర్ల సంఖ్య బాగా పెరిగింది. వ్యవసాయ పనులు అన్నిటికి కిరాయి ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. స్థానికేతరులైన ధనవంతులు గ్రామాల్లో వందల ఎకరాలు భూములు కొనుగోలు చేస్తుండడం వల్ల భూముల ధరలు పెరిగి పచ్చిక బీళ్లు కరువయ్యాయి. పశువులు తిరగడానికి చోటు లేకపోవడం, పశుగ్రాసం, కూలీల కొరత తదితర కారణాల వల్ల రైతులకు పశుపోషణ భారమైంది. దాదాపు రైతులందరూ పశువులను అమ్మి వ్యవసాయ పనులన్నీ సొంత, కిరాయి ట్రాక్టర్లతో చేయించుకుంటున్నా రు. ప్రస్తుతం చాట్రాయి మండలంలోని 18 గ్రామాల్లో 10 ఎడ్లబండ్లే మిగిలి ఉండడంపై ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. కొన్ని వందల తరాల మానవ జీవనస్రవంతిలో భాగమైన ఎడ్లబండ్లు కనుమరుగు కావడం పట్ల పలువురు ఆవేదన చెందుతున్నారు.



ముసునూరు పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న భవనం

ఈ భవనం.. విష సర్పాలకు నిలయం

విద్యార్థుల ఆందోళన

ముసునూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న భవనం విష సర్పాలకు నిలయంగా మారింది. ఈ భవనం నుంచి పాములు పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల రెండు పాములు పాఠశాల గదుల్లోకి వెళ్ళడంతో విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. శిథిల భవనాన్ని తొలగించడానికి గత వైసీపీ ప్రభుత్వం టెండర్ పిలువగా ఎవరూ ముందుకు రాలేదు. ఈ భవనం లోపల పుట్టలు పెరిగి సర్పాలు, పురుగులకు అవాసంగా మారింది. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు సమస్యను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళారు. శిథిల భవనాన్ని ఇప్పటికైన తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పోలేరమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

పోలేరమ్మకు ఆషాఢ సారె

కలిదిండి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెదలంక గ్రామంలో కొలువైన పోలేరమ్మకు ఆషాఢం సందర్భంగా భక్తులు ఆదివారం మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి సారె సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

కలిదిండి విద్యార్థి ప్రతిభ



యాసిన్

కలిదిండి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ఈసీఈలో కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న మహ్మద్ యాసిన్ 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డి.ప్రసాద్ తెలిపారు. 1000కి 995 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. యాసిన్‌ను ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, సర్పంచ్ మారుతి ప్రసన్న, ప్రిన్సిపాల్ డి.ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

పేకాట శిబిరాలపై దాడి.. 10 మంది జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానపల్లి, నరసింగపాలెం గ్రామాల్లో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు ఆదివారం నరసింగపాలెంలో పేకాట శిబిరంపై దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ. 3,050 స్వాధీనం చేసుకున్నామని, అలాగే కనసానపల్లి గ్రామ శివారులో ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 4,150 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న 8 మంది అరెస్టు

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామంలో కోడి పందేల నిర్వహిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. పందేల సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో వెళ్లి జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 పుంజులు, రూ.4500 నగదును స్వాధీనం చేసుకున్నారు.



ఫౌండేషన్ స్కూలుగా మారిన పెదగొన్నూరు ప్రైమరీ పాఠశాల

ముదినేపల్లి మండలంలో మారిన పాఠశాలల స్వరూపం

ముదినేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో భాగంగా ముదినేపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తయింది. మండలంలో మార్పు జరిగిన పాఠశాలల వివరాలను విద్యాశాఖ అధికార్లు ప్రకటించారు. మండలంలో 67 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 8 జడ్పీ హైస్కూళ్ళు వున్నాయి. మిగిలిన పాఠశాలల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. పెదగొన్నూరు హైస్కూలు హైస్కూలు కం బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మారింది. మండలంలో 38 బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, 4 ఫౌండేషన్ పాఠశాలలు, ఆరు మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. వైవాక, సింగరాయపాలెం యూపీ పాఠశాలలను హైస్కూళ్ళుగా అప్ గ్రేడ్ చేయగా, కోడూరు, చినకామనపూడి, దాకరం, వణుదుర్రు, దేవపూడి, కాకరవాడ, చేవూరు, కొరగుంటపాలెం, వాడపల్లి యూపీ పాఠశాలలను డీగ్రేడ్ చేసి బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చారు. మండలంలోని పెద గొన్నూరు, వడాలి-2, ప్రొద్దుటూరు, చేవూరుపాలెం ప్రాథమిక పాఠశాలలు ఫౌండేషన్ స్కూళ్లగా మారాయి. ఉర్దూ పాఠశాలలుగా సంకర్షణపురం, గురజ-3, ముదినేపల్లి (ఉర్దూ) కొనసాగుతుండగా, 64 పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలోనే బోధన జరుగుతోంది.